

ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి..!

బతికిందే ఊరు..మానిందే మందు అన్న చందాన కష్టాన్నే నమ్ముకున్న వారికి భాష, ప్రాంతంతో పనిలేదని నిరూపిస్తున్నారు.

- 8లో



26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం

జిల్లాలో ఈ నెల 26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీల వినియోగాన్ని నిషేధించాలని సంబంధిత విభాగాల అధికారులను కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు.

- 8లో



ఆకు కూరలతో ఆదాయం

రామభద్రపురం అంతరరాష్ట్ర మార్కెట్ ఆకు కూరలకు కేరాఫ్‌గా మారింది. ఈ ప్రాంతంలోని సుమారు 700 కూరాకుల కుటుంబాలు పాలకూర, తోటకూర, మెంతాకు, గోంగూర, చుక్కకూర, కొత్తిమీర, పుదీనాను విక్రయిస్తూ లాభాలు ఆర్జిస్తున్నాయి. - రామభద్రపురం

న్యూస్‌రీల్

జాతీయ స్థాయి పోటీలకు కేజీబీవీ బాలిక



రత్నకుమారిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ జ్యోతి, పీఈటీ భవానీ

గంట్యాడ: జాతీయ స్థాయి టెన్నీకాయిట్ పోటీలకు కొఠారుబిల్లి కేజీబీవీ విద్యార్థిని పి.రత్న కుమారి అర్హత సాధించింది. ఈ నెల 11 నుంచి 13వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లా గవరపాలెంలో జరిగిన రాష్ట్రస్థాయి టెన్నీకాయిట్ పోటీల్లో తలపడి ప్రతిభ చూపింది. రత్నకుమారిని ప్రిన్సిపాల్ అల్లు జ్యోతి, పీఈటీ పి.భవానీ అభినందించారు.

22న కబడ్డీ జట్ల ఎంపిక

- జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి నాగేశ్వరరావు

గంట్యాడ: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో పాల్గొనేందుకు విజయనగరం జిల్లా సీనియర్ స్త్రీ, పురుష జట్ల ఎంపిక పోటీలు ఈ నెల 22న గంట్యాడ హైస్కూల్ మైదానంలో నిర్వహించనున్నట్టు జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి రంధి నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి పోటీలు సాగుతాయన్నారు. స్త్రీలు 75 కేజీలు, పురుషులు 85 కేజీల బరువు మించకూడదన్నారు. ఎంపిక పోటీలకు వచ్చేవారు ఆధార్ కార్డు తీసుకురావాలని, వివరాలకు సెల్: 9440888369నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సెట్విజ్ సీఈఓగా రామ్‌గోపాల్



సెట్విజ్ సీఈఓగా బాధ్యతలు స్వీకరిస్తున్న రామ్‌గోపాల్

విజయనగరం: సెట్విజ్ సీఈఓగా బి.రామ్‌గోపాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఇన్‌చార్జి సీఈఓగా భూగర్భజల వనరులశాఖ డీడీ దుర్గాప్రసాద్ విధులు నిర్వహిస్తున్నారు. ఆయన స్థానంలో రామ్‌గోపాల్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. విధుల్లో చేరిన అనంతరం కలెక్టర్ సూర్యకుమారిని ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

తేనెటీగల పెంపకానికి విజయనగరం అనుకూలం

- ఖాదీ, గ్రామీణ పరిశ్రమల డైరెక్టర్ డాక్టర్ ఎస్.శ్రీవ్
- వంద శాతం రాయితీపై 200 తేనెటీగల పెట్టెలు అందజేత



తేనెటీగల పెట్టెల నిర్వహణను వివరిస్తున్న అధికారులు

కొత్తవలస: తేనెటీగల పెంపకానికి విజయనగరం జిల్లా అనుకూలమైనదని ఖాదీ, గ్రామీణ పరిశ్రమల డైరెక్టర్ డాక్టర్ ఎస్.శ్రీవ్ అన్నారు. కొత్తవలస మండలం నిమ్మలపాలెం పంచాయతీ శివారు రాయపురాజుపేట గ్రామ సమీపంలోని కన్నా నర్సరీ వద్ద పూసపాటిరేగ, కొత్తవలస మండలాలకు చెందిన తేనెటీగల పెంపకందారులకు వంద శాతం రాయితీపై 200 పెట్టెలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్.శ్రీవ్ మాట్లాడుతూ జిల్లాలో తేనెటీగల పెంపకానికి అనువైన వాతావరణం ఉందన్నారు. గ్రామాల్లోని నిరుద్యోగ యువకులు ముందుకు వస్తే వారం రోజులపాటు తేనెటీగల పెంపకంపై శిక్షణ ఇస్తామని చెప్పారు. అనంతరం వారికి వంద శాతం రాయితీపై ఒక్కొక్కరికి రూ.50వేలు విలువైన 10 తేనెటీగల పెంపకం పెట్టెలను అందజేస్తున్నామన్నారు. ఇప్పటివరకు ఖాదీ, గ్రామీణ పరిశ్రమల శాఖ నుంచి 3వేల తేనెటీగల పెంపకం పెట్టెలను వందశాతం రాయితీపై అందజేశామని చెప్పారు. ఉద్యానవనశాఖ అధికారి శైలజ మాట్లాడుతూ తేనెటీగల పెంపకం ద్వారా యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ప్రభుత్వం అంజేస్తున్న రాయితీలను యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ముందుగా తేనెటీగల పెంపకంపై శిక్షణ పూర్తిచేసుకున్న యువకులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఖాదీ కమిషన్ ఏడీ ఈశ్వరరావు, అకౌంటెంట్ ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ నాయకులు కొట్యాడ శ్రీనివాసరావు, కన్నానర్సరీ అధినేత దుక్కకన్నబాబు పాల్గొన్నారు.

భూమి భద్రం.. హక్కు పత్రాలు శాశ్వతం!



భూముల రీ సర్వే.. భూ యజమానులకు మేలుచేసేందుకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేపట్టిన ఓ మహాయజ్ఞం. దీర్ఘకాలిక భూ సమస్యలను పరిష్కరిస్తూ.. పక్కా హద్దులతో.. శాశ్వత హక్కు పత్రాలను పైసా ఖర్చులేకుండా పంపిణీ చేస్తోంది. ఈ బృహత్తర క్రతువు వివిధ శాఖల సమన్వయంతో విజయనగరం జిల్లాలో నిర్విరామంగా సాగుతోంది. రైతన్నల్లో సంతోషం నింపుతోంది.

- వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు
- భూరక్ష కార్యక్రమంతో సదవకాశం
- తొలివిడత 179 గ్రామాల్లో రీసర్వే పూర్తి
- జిల్లాకు చేరిన భూహక్కు పత్రాలు 24,068
- ఇంతవరకూ 6,338 పత్రాలు రైతులకు అందజేత
- రెండో విడతలో 306 గ్రామాల్లో చురుగ్గా రీసర్వే

సాక్షి ప్రతినిధి, విజయనగరం:

వందేళ్ల నాటి భూసమస్యలు, వివాదాలను పరిష్కరించడంతో పాటు పకడ్బందీగా భూహక్కు పత్రాలను ఆయా యజమానులకు అందించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమగ్ర భూసర్వేకు నడుంబిగించింది. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి సంకల్పించిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు-భూరక్ష కార్యక్రమం సర్వత్రా రైతుల హర్షాతిరేకాలు అందుకుంటోంది. జిల్లాలో భూముల రీ సర్వే ప్రక్రియ తొలి దఫా పూర్తయింది. కలెక్టర్ ఎ.సూర్యకుమారి, జేసీ మయూర్‌అశోక్ ఎప్పటికప్పుడు తహసీల్దార్లను, రెవెన్యూ సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. ప్రస్తుతం రెండో దఫా రీసర్వేలో యంత్రాంగం తలమునకలై ఉంది. మరోవైపు తొలిదఫాలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో రైతులకు భూమి హక్కు పత్రాలను అందజేస్తున్నారు.

అంగుళమైనా తేడా లేకుండా పక్కాగా...

సర్వే ఆఫ్ ఇండియా, ప్రైవేట్ ఏజెన్సీలు డ్రోన్ సర్వే చేసి ఇచ్చిన చిత్రాలు (ఓఆర్ఐ), భూ యజమానులు వాస్తవంగా చూపించిన సరిహద్దులను పొల్చి కొలతలు వేస్తున్నారు. జిల్లాలోని 983 గ్రామాల్లో రీసర్వే చేపట్టింది 3,842.53 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం. ఆ భూములన్నీ అంగుళం కూడా తేడా రానీయకుండా సూక్ష్మ పరిశీలనతో రీసర్వే ప్రక్రియను దశలవారీగా అధికారులు చేపడుతున్నారు. సర్వే విభాగం, రెవెన్యూ శాఖ సమాంతరంగా పనిచేస్తూ ఈ యజ్ఞాన్ని వేగవంతం చేశారు. ఇప్పటికే మొదటి విడతలో రీసర్వే పనులు 179 గ్రామాల్లో విజయవంతంగా పూర్తయ్యాయి. రెండో విడతలో మరో 306 గ్రామాల్లో రీసర్వే చేయాలని ప్రభుత్వం జిల్లా యంత్రాంగానికి లక్ష్యంగా నిర్దేశించింది.



భూహక్కు పత్రాలతో రైతులు

తాతల నాటి భూములకు ఇప్పుడు హక్కుపత్రాలు



మావి జిరాయితీ భూములు. తాతల నాటి నుంచి సాగు చేసుకుంటున్నాం. మాకే కాదు ఇంతవరకూ మా గ్రామంలో ఏ రైతుకూ సరైన భూహక్కు పత్రాలు లేవు. వైఎస్సార్ జగనన్న శాశ్వత భూహక్కు-భూరక్ష కార్యక్రమంలో సమగ్ర భూసర్వేను 2020 డిసెంబర్ 23న ప్రారంభించారు. కరోనా వల్ల రెండేళ్ల పాటు ఆగిపోయింది. ఇటీవలే సర్వే పూర్తి చేశారు. మా గ్రామంలో దాదాపు 200 ఎకరాలకు సంబంధించి భూహక్కు పత్రాలను రైతులమంతా ఇటీవలే మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా అందుకున్నాం. వాటితో మా భూమికి రక్షణ, మాకు భరోసా దక్కిందని ఆనందంగా ఉన్నాం. - సుంకరి సత్యనారాయణ, తమటాడ, బొండపల్లి మండలం



వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు-భూ రక్ష లోగో

దఫదఫాలుగా చేరుతున్న భూహక్కు పత్రాలు...

తొలివిడతలో రీసర్వే పూర్తిఅయిన 179 గ్రామాలకు సంబంధించిన భూమి యజమానులకు హక్కుపత్రాలు దఫదఫాలుగా జిల్లాకు చేరుతున్నాయి. అలా 24,068 పత్రాలు ఇప్పటివరకూ జిల్లాకు వచ్చాయి. వాటిలో 6,338 పత్రాలను ఆయా భూయజమానులకు అధికారులు అందజేశారు. మరో 6,222 పత్రాలు వివిధ కారణాలతో వాటి హక్కుదారులు అందుబాటులో లేకపోవడంతో పంపిణీ చేయలేదు. మిగతా భూహక్కు పత్రాలను వెనువెంటనే అందజేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

మరెన్నో ఉపయోగాలు...

పాస్ పుస్తకంలో పొందుపరచిన భూముల వివరాలు కాక ఇతర లావాదేవీల కోసం కొత్త భూమి యాజమాన్యపు హక్కు పత్రం-పట్టాదారు పాసు పుస్తకం తీసుకోవడం ఐచ్ఛికం. మరో మార్గంలో అయితే ఆ వివరాలతో కూడిన వన్‌బీ నమూనా గ్రామ/వార్డు సచివాలయంలో లేదా మీ సేవ కేంద్రాల్లో పొందవచ్చు. బ్యాంకు రుణం తీసుకొనేటపుడు గానీ, భూమి క్రయవిక్రయాల సమయంలో గానీ భూమి యాజమాన్యపు హక్కు పత్రం-పట్టాదారు పాసు పుస్తకం అధికారికంగా చూపించాల్సిన అవసరం లేదు. పుస్తకం పోయినా, చిరిగిపోయినా గ్రామ/వార్డు సచివాలయాల్లో నిర్ణీత రుసుం చెల్లించి నకలు పొందవచ్చు.

భూహక్కుపత్రంలో ఏముంది?

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం-రెవెన్యూ శాఖ అందిస్తున్న భూమి యాజమాన్యపు హక్కు-పట్టాదారు పాసు పుస్తకాన్ని అత్యంత పకడ్బందీగా భద్రతా ప్రమాణాలతో రూపొందిస్తున్నారు.

మొదటి పేజీలో: జిల్లా, డివిజన్, మండలం, గ్రామం, ఖాతా నంబరు, పాసుపుస్తకం ఇచ్చిన తేదీ, పట్టాదారుడి వివరాలు, చిరునామా, కులం, ఆధార్ నంబరు, మొబైల్ నంబర్ ఉంటాయి. పట్టాదారుని ఫొటో, క్యూఆర్ కోడ్ ఉంటాయి. ఆ క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే పట్టాదారుడి, పాస్ పుస్తకం వివరాలన్నీ తెలుస్తాయి.

రెండో పేజీలో: పట్టాదారుడికి గ్రామంలో ఉన్న భూమి వివరాలు... అంటే సర్వే నంబరు వారీగా భూమి విస్తీర్ణం ఉంటాయి. భూమి వర్గీకరణ, పట్టాదారుడికి ఆ భూమి ఏవిధంగా దఖలు పడిందీ తదితర వివరాలు, రీ సర్వేలో ఆ భూమికి సర్వే నంబరు వారీగా ఇచ్చిన ఎల్‌పీ నంబరు ఉంటాయి. భూమి కమతం పటం విశిష్ట సంఖ్యతో ఉన్న కమతానికి సంబంధించిన అక్షాంశాలు ఉంటాయి. వాటితో భూమి కొలతలు సులభంగా తెలుసుకోవచ్చు. భూమి సరిహద్దు రాళ్లు ఎవరైనా మార్చినా క్యూఆర్ కోడ్‌ను మొబైల్ ఫోన్‌లోని యాప్‌తో స్కాన్ చేస్తే చాలు తెలిసిపోతుంది. తమ భూముల వివరాలను 'మీ భూమి' పోర్టల్‌లోనూ చూసుకోవచ్చు.

ఒక్క రూపాయి ఖర్చు లేకుండా...



నాకు 38 సెంట్లు భూమి ఉంది. ఇంతవరకూ పాస్ పుస్తకం లేదు. దానివల్ల రుణాలు తీసుకోవడానికే కాదు ఎవరికైనా అమ్ముదామన్నా వీలయ్యేదికాదు. ఇప్పుడు ప్రభుత్వం ఒక్క రూపాయి ఖర్చు లేకుండా నాకు శాశ్వత భూహక్కును కల్పిస్తూ పాస్ పుస్తకాలను ఇచ్చింది.

– ఇ అప్పన్న, కొర్లాం గ్రామం, మెరకముడిదాం మండలం

భూహక్కు పత్రాల పరిస్థితి...

రెవెన్యూ డివిజన్	చేరినవి	పంపిణీ	అందజేయాల్సినవి
బొబ్బిలి	14,127	3,425	10,702
చీపురుపల్లి	6,898	1,936	4,962
విజయనగరం	3,043	977	2,066
మొత్తం	24,068	6,338	17,730

నిరంతర ప్రక్రియ



భూహక్కు పత్రాల పంపిణీ నిరంతర ప్రక్రియగా కొనసాగిస్తున్నాం. జిల్లాకు వచ్చిన పత్రాలను షెడ్యూల్ ప్రకారం ఆయా గ్రామాల్లో పంపిణీ చేస్తున్నాం. ఇంతవరకు జిల్లాకు 24,068 పత్రాలు వచ్చాయి.

– వి.సూర్యనారాయణ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, కేఆర్ఆర్‌సీ

షెడ్యూల్ ప్రకారం రీ సర్వే



రీసర్వే పనులు షెడ్యూల్ ప్రకారం పూర్తి చేస్తున్నాం. తొలి విడతలో 179 గ్రామాల్లో సర్వే పనులు పూర్తి చేశాం. రెండో విడత లక్ష్యంగా మరో 306 గ్రామాల్లో చేపడుతున్నాం. వీటిలో దాదాపు 60 శాతం గ్రామాల్లో పనులు తుది దశకు చేరాయి. సమాంతరంగా గ్రామ కంఠాల సర్వే పనులు కూడా చేపడుతున్నాం.

– టి.త్రివిక్రమరావు, సర్వే శాఖ సహాయ సంచాలకులు

జగనన్నకు ధన్యవాదాలు



నాకు 56 సెంట్లు జిరాయితీ భూమి ఉంది. దానికి ఇంతవరకూ పాసు పుస్తకాలు లేక బ్యాంకు రుణాలు వచ్చేవి కావు. ఇప్పుడు రీసర్వేతో నా భూమికి 1-బి, యాజమాన్య హక్కు పత్రాలు అందజేశారు. ఇంత మేలుచేసిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, రెవెన్యూ అధికారులకు ధన్యవాదాలు.

– గోగాద రమణ, తలారి, ఎస్.కోట మండలం

మాకు ఇదొక వరం



మాకు 55 సెంట్లు భూమి ఉంది. గతంలో సర్వే కాకపోవడంతో బ్యాంకు రుణాలకు అవకాశం లేకపోయేది. ఇన్నాళ్లకు రీసర్వేతో 1బీతో పాటు హక్కు పత్రాలు కూడా మాకు అందాయి. ప్రభుత్వం ఈ విధమైన కార్యక్రమం చేయడం గొప్ప వరం లాంటిది.

– పిల్లా రమ, నందిగాం గ్రామం, భోగాపురం మండలం

43 కేంద్రాల్లో కానిస్టేబుళ్ల ప్రిలిమినరీ పరీక్ష

- అన్ని కేంద్రాల వద్ద పటిష్ట భద్రత
- 144 సీఆర్‌పీసీ, సీసీ కెమెరాలతో స్వీయ పర్యవేక్షణ
- హాల్‌టికెట్స్, గుర్తింపుకార్డులకే అనుమతి
- ఎస్పీ ఎం.దీపిక



ఎం.దీపిక, ఎస్పీ, విజయనగరం

విజయనగరం క్రైమ్: ఏపీ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఆధ్వర్యంలో పోలీస్ కానిస్టేబుళ్ల ఉద్యోగ నియామకాలకు ఈ నెల 22న నిర్వహిస్తున్న ప్రాథమిక రాతపరీక్షకు భద్రతా ఏర్పాట్లు పూర్తిచేసినట్టు ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. తన కార్యాలయంలో స్థానిక విలేకరులతో ఆమె గురువారం మాట్లాడారు. రాత పరీక్ష జిల్లాలోని 43 పరీక్ష కేంద్రాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సాగుతుందన్నారు. విజయనగరం పట్టణంలో 28, బొబ్బిలిలో 13, రాజాంలో 2 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశామని చెప్పారు. ఇప్పటికే సంబంధిత పోలీస్ అధికారులు పరీక్ష కేంద్రాలను సందర్శించి, స్ట్రాంగ్ రూమ్‌లు, భద్రత, సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షించారన్నారు. అభ్యర్థులను పరీక్షించిన తర్వాతనే ఉదయం 9 గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తామని, పది గంటల తర్వాత ఎవరినీ పరీక్ష కేంద్రంలోకి అనుమతించేదిలేదని స్పష్టం చేశారు. అభ్యర్థులు తమ వెంట తెచ్చుకునే విలువైన సామగ్రిని వారే సొంతంగా భద్రపరుచుకోవాలన్నారు. హాల్ టికెట్స్‌లో సూచించిన నియమ, నిబంధనలను అభ్యర్థులు క్షుణ్ణంగా చదువుకుని, వాటిని విధిగా పాటించాలన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్లు, డిజిటల్ వాచ్‌లు, బ్లూటూత్, కాలిక్యులేటర్లు తదితర ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్‌ను అనుమతించమన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సీఆర్‌పీసీ అమల్లో ఉంటుందని, ఎవరూ గుంపులుగా ఉండకూడదన్నారు. పరీక్ష కేంద్రాలకు దగ్గర్లోని జెరాక్స్ షాపులను మూసివేయిస్తామని చెప్పారు. అభ్యర్థుల సౌలభ్యం కోసం రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్లలో ప్రత్యేకంగా హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేస్తామని తెలిపారు. పరీక్ష నిర్వహణలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తొమ్మిది రూట్లుగా విభజించి, ఒక్కో పోలీస్ అధికారిని బాధ్యులుగా నియమించినట్టు వెల్లడించారు. పరీక్ష కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్‌లు ఆకస్మిక తనిఖీలు చేస్తాయని చెప్పారు. జేఎన్‌టీయూ పరీక్ష కేంద్రానికి అభ్యర్థులను తీసుకెళ్లేందుకు, తిరిగి తీసుకొచ్చేందుకు పోలీసుశాఖ ఉచితంగా ప్రత్యేకంగా రెండు వాహనాలను ఏర్పాటుచేసినట్టు వెల్లడించారు.

22, 23 తేదీల్లో చిరుధాన్యాల ఉత్పత్తుల ప్రదర్శన

విజయనగరం అర్బన్: జిల్లాలో చిరుధాన్యాల సాగును విస్తృతం చేయాలన్న లక్ష్యంతో ఈ నెల 22, 23వ తేదీల్లో నగరంలోని ఆనందగజపతి ఆడిటోరియంలో చిరుధాన్యాలు, చిరుధాన్యాల ఉత్పత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. ఐక్యరాజ్య సమితి 2022-23ను చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో చిరుధాన్యాల్లోని పోషక విలువలు, వాటి వినియోగాన్ని కేంద్రప్రభుత్వం ప్రోత్సహిస్తోందన్నారు. కొర్రలు, జోవార్, భాజర, రాగి, సామలు, ఊదలు, అరికెలు వంటి చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా పోషక విలువలు పెరిగి ఆరోగ్యకర జీవనం అలవడుతుందన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన కోసం ఈ నెల 20న నగరంలో 2కే రన్ నిర్వహిస్తామని చెప్పారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో చిరుధాన్యాల ప్రదర్శనకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలు రెండురోజుల ప్రదర్శనను సందర్శించి చిరుధాన్యాలపై అవగాహన పెంచుకోవాలని కోరారు.

గురుకులాలను తనిఖీ చేయడం లేదా?



ఐదో తరగతి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలపై గురుకులాల కార్యదర్శిని ప్రశ్నిస్తున్న పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్

బొబ్బిలి: విద్యార్థుల చదువుకోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంత ఖర్చు చేస్తోందో తెలుసా? మీరు సరిగ్గా గురుకులాలను తనిఖీ చేయడం లేదా? అంటూ పాఠశాల విద్యాశాఖ చీఫ్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ గురుకులాల కార్యదర్శి నరసింహారావుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బొబ్బిలి సింహాలతోటలో ఉన్న గురుకుల పాఠశాలను గురువారం రాత్రి సందర్శించారు. ఐదో తరగతి విద్యార్థుల అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. ఓ విద్యార్థి వద్ద ఉన్న సెమిస్టర్ పుస్తకంలో ఏమీ రాయకపోవడాన్ని చూసి గురుకులాల కార్యదర్శిని ప్రశ్నించారు. మీరెందుకు పాఠశాలల్లోని సిబ్బందిపై చర్యలు తీసుకోవడం లేదన్నారు. కార్యదర్శి ఏదో చెప్పబోతుండగా ప్రభుత్వం జీతాల రూపంలో కోట్లాది రూపాయలు చెల్లిస్తోందని, పుస్తకాలు, ఇతర మెటీరియల్ సరఫరా చేస్తుంటే ఉపాధ్యాయులు సరిగా పనిచేయకపోతే ఎలా అంటూ అసహనం వ్యక్తంచేశారు. అక్కడి నుంచి సమీపంలోని కేజీబీవీను పరిశీలించారు.

నేడు పర్యటించే ప్రాంతాలివే..

బొబ్బిలి, బాడంగి, తెర్లాం, రామభద్రపురం, దత్తిరాజేరు, మెంటాడ, గజపతినగరం, బొండపల్లి మండలాల్లోని పలు పాఠశాలలు, గురుకులాలు, కేజీబీవీలను ప్రవీణ్ ప్రకాష్ శుక్రవారం సందర్శించనున్నారు.

పరిశోధనలకు ఆధారం.. వేమన పద్యాలు

- కలెక్టర్ సూర్యకుమారి
- యోగి వేమనకు ఘన నివాళులర్పించిన అధికారులు, ప్రజాప్రతినిధులు



పద్యపఠన విజేతకు ప్రశంసాపత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో అత్యంత సులభంగా తేలికైన పదజాలంతో రచించిన వేమన పద్యాలు ఎన్నో ఆధునిక పరిశోధనలకు ఆధారంగా మారాయని కలెక్టర్ ఎ.సూర్యకుమారి అన్నారు. కలెక్టర్ ఆడిటోరియంలో యోగి వేమన జయంతిని గురువారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి కలెక్టర్ సూర్యకుమారి, డీఆర్‌ఓ ఎం.గణపతిరావు, రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేమన పద్యాలతో జీవిత సత్యాలను ప్రజలకు తెలియజేశారన్నారు. తెలుగు భాషగొప్పదనాన్ని ప్రపంచానికి చాటి చెప్పారని కీర్తించారు. అన్నిరకాల సమాజ పరిస్థితులకు అద్దంపట్టేలా వేమన పద్యరచనలు సాగాయన్నారు. జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకునేందుకు వేమన పద్యాలు దోహదపడతాయని కలెక్టర్ పేర్కొన్నారు. వివిధ పాఠశాలల విద్యార్థులు వేమన పద్యాలను వినిపించి ఆహుతులను ఆకట్టుకున్నారు.

విజేతలకు బహుమతులు

వేమన జయంతిని పురస్కరించుకొని విద్యాశాఖ, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పద్యపఠన పోటీల్లో సీనియర్స్ విభాగంలో వి.నవ్యశ్రీ(గంట్యాడ జెడ్పీ హైస్కూల్), జి.ప్రసాద్ (విజయనగరం జీఎంఆర్‌ఎస్‌కేటీ), కేవీఎం చైతన్య (డెంకాడ నేషనల్ పబ్లిక్ స్కూల్)లు వరుస మూడు బహుమతులు గెలుచుకున్నారు. జూనియర్స్ విభాగంలో సీహెచ్ చరణ్య (చినరేవుపల్లి ప్రాథమికోన్నత పాఠశాల), కె.హిందుకుమార్, ఆర్.జోహన్(డెంకాడ నేషనల్ పబ్లిక్ స్కూల్) వరుస మూడుస్థానాల్లో నిలిచారు. వీరికి కలెక్టర్, ఇతర ప్రముఖుల చేతుల మీదుగా జ్ఞాపికలు, ధ్రువపత్రాలు అందజేశారు.

లోక కవి వేమన



వేమన చిత్ర పటానికి పూలమాల వేస్తున్న జెడ్పీ చైర్మన్, జెడ్పీ సీఈఓ

విజయనగరం గంటస్తంభం: యోగి వేమన.. లోక కవి అని, తన పద్యాలతో సమాజ చైతన్యానికి పాటుపడ్డారని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు పేర్కొన్నారు. వేమన జయంతిని పురస్కరించుకుని జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ఎం.అశోక్‌కుమార్, డిప్యూటీ సీఈఓ కె.రాజ్‌కుమార్, డీపీఓ నిర్మలాదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు కె.వి. సూర్యనారాయణరాజు, జెడ్పీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేమనకు పోలీస్ శాఖ నివాళి



వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: పామరులకు అర్థమయ్యే భాషలో పద్యాలు రచించి, మెప్పించిన మహాకవి వేమనకు జిల్లా పోలీస్ శాఖ ఘన నివాళులర్పించింది. వేమన జయంతిని పురస్కరించుకుని జిల్లా పోలీస్ కార్యాలయంలో వేమన చిత్రపటానికి ఎస్పీ ఎం.దీపిక పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేమన ఒక ప్రజాకవి, సంఘ సంస్కర్తగా కొనియాడారు. ఆయన పద్యాలు వినని, తెలియని వారుండరన్నారు. కార్యక్రమంలో ఏఆర్ ఏఎస్పీ ఎం.ఎం.సోల్మన్, బొబ్బిలి డీఎస్పీ బి.మోహనరావు, ఏఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, ఎస్‌బీ సీఐ జి.రాంబాబు, రూరల్ సీఐ టి.వి. తిరుపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోలీస్ సంఘం డైరీ ఆవిష్కరణ



డైరీని ఆవిష్కరిస్తున్న కమాండెంట్ విక్రాంత్ పాటిల్, తదితరులు

డెంకాడ: రాష్ట్ర పోలీస్ సంఘం డైరీని చింతలవలస ఏపీఎస్పీ ఐదవ బెటాలియన్ కమాండెంట్ విక్రాంత్ పాటిల్‌తో పాటు పలువురు అధికారులు, సంఘం నాయకులు గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ డి.వి.రావు, వి.నారాయణరావు, ఆర్ఐలు చంద్రశేఖర్, వెంకటరావు, కేఈఎం.రాజు, బాలకృష్ణ చౌదరి, సంఘం బెటాలియన్ అధ్యక్షుడు మిత్తిరెడ్డి అప్పలనాయుడు, సెక్రటరీ ఎం. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మధుపాడలో డయేరియా ఛాయలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారితో మాట్లాడుతున్న వైద్యుడు సాయికృష్ణ

గజపతినగరం రూరల్: మండలంలోని మధుపాడ గ్రామంలో డయేరియా ప్రబలినట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి. గ్రామంలోని మొండి వీధికి చెందిన ఐదు కుటుంబాల వారు గడిచిన కొన్నిరోజులుగా నీళ్ల విరోచనాలతో అనారోగ్యం పాలైనట్లు స్థానికుల సమాచారం. ఇటీవల రెండు రోజుల నుంచి బైరెడ్డి.రాధ, బెరెడ్డి విష్ణు, బూడి పవన్, వలిరెడ్డి రోషిణిలు వాంతులు, విరేచనాలతో బాధ పడుతూ గజపతినగరం ప్రభుత్వ ఆస్పత్రిలో చేరిన విషయం తెలుసుకున్న మరుపల్లి పీహెచ్‌సీ వైద్యుడు సాయికృష్ణ వారి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి మందులు పంపిణీ చేశారు.

నిరుద్యోగుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం



పార్వతీపురం: శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాల కోసం పార్వతీపురం మన్యం జిల్లాలో 18 నుంచి 28 సంవత్సరాల మధ్య వయసు కలిగి అర్హత గల నిరుద్యోగుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.సాయికుమార్ గురువారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ మేరకు సాలూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిరుద్యోగులకు ఉద్యోగావకాశాల కోసం శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఐటీఐ/డిప్లమో అర్హతతో ఫోర్ వీలర్ టెక్నీషియన్, పదవతరగతి/ఇంటర్ /డిగ్రీ అర్హతతో ప్రొడక్షన్ మెకానిక్ ఆపరేటర్ శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. శిక్షణ కాలం మూడు నెలలు ఉంటుందని స్పష్టం చేశారు. ఇందు కోసం హెచ్‌టీటీపీఎస్://ఫారమ్స్.జిఎల్ఇ/వైటిఎం3ఓఎఫ్ఐపియు 1డబ్ల్యూజెయు5జిబి6లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8555909899, 6305110947 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌కు రామభద్రపురం విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం

రామభద్రపురం: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు తమ పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు రామభద్రపురం ఉన్నత పాఠశాల పీడీ కొల్లి తవిటినాయుడు గురువారం తెలిపారు. ఎంపికైన విద్యార్థులను పీడీతో పాటు హెచ్‌ఎం కె.కామేశ్వరరావు, ఉపాధ్యాయులు అభినందించారు.ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ ఈ నెల 20, 21 తేదీలలో శ్రీకాకుళంలోని కోడి రామ్మూర్తి స్టేడియంలో నిర్వహించనున్న డిస్కస్‌త్రో, షాట్‌పుట్, పరుగు పందెం రాష్ట్రస్థాయి పోటీలలో తమ విద్యార్థులు పాల్గొననున్నట్టు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు.

ఎక్కడో పుట్టి.. ఎక్కడో పెరిగి..!

- వలస వచ్చి జీవనయానం
- వ్యవసాయ పనిముట్లు తయారీలో నిమగ్నం



కొలిమిలో ఇనుమును కాలుస్తున్న రాజస్థానీ మహిళలు



అద్దెకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న టార్పాలిన్‌లు



కొలిమిలో కాల్చిన ఇనుమును సమ్మెటతో మోదుతున్న మహిళ

కొత్తవలస: బతికిందే ఊరు..మానిందే మందు అన్న చందాన కష్టాన్నే నమ్ముకున్న వారికి భాష, ప్రాంతంతో పనిలేదని నిరూపిస్తున్నారు రాజస్థాన్, తెలంగాణ రాష్ట్రాల నుంచి వచ్చి ఈ ప్రాంతాల్లో వ్యవసాయానికి సాయం చేస్తున్నారు. రాజస్థాన్ నుంచి వచ్చిన వారు ముడి ఇనుముతో వ్యవసాయ పనిముట్లు తయారు చేసి ఉపాధి పొందుతున్నారు. తెలంగాణ వాసులు ఇక్కడికి వచ్చి వరిచేల నూర్పులకు టార్పాలిన్‌లు అద్దెకు ఇస్తున్నారు. శ్రమజీవుల జీవనశైలిపై మానవీయ కథనం. పొట్ట చేతపట్టుకుని ఊరికి దూరంగా రాష్ట్రంకాని రాష్ట్రాలకు భాష తెలియని ప్రాంతంలో బతుకు పోరాటం చేస్తున్నారు వారు. శ్రమనే నమ్ముకుని కుటుంబాలతో సహా వలసబాట పట్టి వ్యవసాయ పనిముట్ల తయారీలో భాగంగా కొలిమిలో ఇనుము కాలుస్తూ పురుషులతో సమానంగా మహిళలు కూడా సమ్మెట వేస్తూ పలు రకాల వ్యవసాయ పనిముట్లు తయారు చేస్తున్నారు. డిసెంబర్ వచ్చిందంటే వందల కుటుంబాల వారు వలస బాటపట్టి విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాంకుళం జిల్లాలకు వలసవచ్చి సంప్రదాయ వ్యవసాయ పనిముట్లు తయారు చేసి అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. తిరిగి ఫిబ్రవరి మొదటి వారంలో తిరుగు ప్రయాణమవుతారు. వలస వచ్చిన వారంతా రాజస్థాన్ రాష్ట్రంలోని సాగర్ జిల్లాకు చెందిన మార్వాడీ కుటుంబాల వారు. జిల్లాలోని పలు మండలాల్లో గల ముఖ్యమైన గ్రామాల్లో టెంట్లు వేసుకుని తాత్కాలికంగా పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు.

అందరూ కష్టపడితేనే రోటీ

కుంటుంబంతో సహా వచ్చిన వారంతా తమ కడుపు నిండేందుకు రోటీలకు కావాల్సిన డబ్బులు కష్టపడి సంపాదించు కుంటున్నారు. మహిళలు కొలిమివేసి పాత ఇనుమును కాలిస్తే పురుషులు సమ్మెట వేస్తూ వస్తువులను తయారు చేస్తున్నారు. కత్తులు, గొడ్డళ్లు, కొడవళ్లు, రకరకాల వ్యవసాయ పనిముట్లతో పాటు ఇంట్లోకి అవసరమైన వస్తువులను తయారు చేస్తున్నారు. పెద్దలు తయారు చేసిన వస్తువులను చిన్నారులు ఇతర ప్రాంతాలకు తీసుకువెళ్లి విక్రయిస్తూ బతుకు పోరాటం సాగిస్తున్నారు.

తెలంగాణ నుంచి..

ఈ ప్రాంతంలో వరి కోతలు ప్రారంభమైతే తెలంగాణ, నెల్లూరు ప్రాతాల నుంచి పెద్ద ఎత్తున టార్పాలిన్‌లు పట్టుకుని కుంటుంబాలతో సహా వలస వస్తున్నారు. జిల్లాలోని ప్రతి జంక్షన్, ప్రధాన గ్రామాల్లో టార్పాలిన్‌లు గుట్టలుగా వేసి అద్దెకు ఇస్తుంటారు. ఆక్కడే చిన్న చిన్న గుడారాలను ఏర్పాటు చేసుకుని పిల్లలతో కలిసి జీవనం సాగిస్తున్నారు.జనవరి చివరి నాటికి వారంతా తిరుగు ప్రయాణమవుతారు.

కుటుంబాలను పోషించుకోవడానికే



మా ప్రాంతంలో పంటలు సక్రమంగా పండక పోవడంతోనే జీవనోపాధి కోసం ఈ రంగాన్ని ఎంచుకున్నాం. గోనె సంచులు కొని అన్‌సీజన్‌లో టార్పాలిన్‌లు కుట్టి సీజన్‌లో ఆంధ్రాప్రాంతం వస్తున్నాం. సుమారు నెల రోజుల పాటు ఇక్కడ వ్యాపారం సాగుతుంది. టార్పాలిన్‌లకు ఈ ప్రాంతంలో మంచి గిరాకి ఉంది.

కె.బ్రహ్మయ్య, మహబూబ్‌నగర్, తెలంగాణ రాష్ట్రం

పని సులువుగా అవుతోంది



గ్రామాల్లో గతంలో మాదిరి వ్యవసాయ పనిముట్లు తయారు చేసే వారు కరువయారు. ప్రస్తుతం రాజస్థానీలు తయారు చేస్తున్న వస్తువులు ఎంతో నాణ్యంగా ఉంటున్నాయి. తెలంగాణ వాసులు సమకూరుస్తున్న టర్పాలిన్‌ల వల్ల పని సలుభమవడంతో పాటు ఖర్చు కూడా తగ్గి సమయం ఆదా అవుతోంది.

గుల్లిపల్లి అప్పలరాజు, శ్రీరాంపురం, లక్కవరపుకోట మండలం

పులి దాడిలో ఒక్క ఆవే మృతి

బొండపల్లి: మండలంలోని గొల్లుపాలెం గ్రామంలో పులి దాడిలో ఒక్క ఆవు మాత్రమే మృతి చెందిందని ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ కేవీఎస్ రాజు గురువారం తెలిపారు.గ్రామానికి చెందిన రైతు పారాది చంద్ర మోహన్ ఆవు మృతి చెందినట్లు చెప్పారు. రెండు ఆవులపై పులి దాడి చేసినట్లు ఎక్కడా ఆనవాళ్లు తమకు లభించలేదని, పశువైద్యాధికారులు కూడా దొరికిన ఆవు కళేబరం ఒక్కటిగానే గుర్తించి పంచనామా నిర్వహించినట్లు చెప్పారు. ప్రసుత్తం పులి జాడ కోసం అటవీ ప్రాంతంలో అమర్చిన కెమెరాలను బట్టి అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లాలోని అనంతగిరి అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నట్లు గుర్తించామని తెలిపారు.

గడ్డి దగ్ధం



మంటలు ఆర్పుతున్న స్థానికులు

జామి: మండలంలోని లొట్లపల్లి గ్రామంలో ట్రాక్టర్‌తో ఉన్న వరి గడ్డి గురువారం దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు పెసల రాము అట్టాడలో వరి గడ్డి కొనుగోలు చేసి ట్రాక్టర్‌పై లొట్లపల్లి తీసుకువస్తుండగా కళ్లం దగ్గరకు వచ్చేసరికి అక్కడ ఉన్న విద్యుత్‌వైర్లు తగిలి మంటలు చెలరేగాయి. గమనించిన స్థానికులు మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో ట్రాక్టర్‌పై ఉన్న గడ్డితో పాటు పక్కనే ఉన్న రాము సొంత గడ్డి వాము కూడా దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది వచ్చి పూర్తి స్థాయిలో మంటలు అదుపు చేశారు. ఈ ప్రమాదంలో రైతుకు సుమారు రూ.40 వేల నష్టం సంభవించింది.

22న గుంటూరులో శాప్ టీటీ లీగ్ టోర్నీ

- ఆసక్తి గల వారికి ఆహ్వానం

విజయనగరం: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 22న నిర్వహించబోయే టేబుల్ టెన్నిస్ లీగ్ టోర్నీలో ఆసక్తి గల జిల్లా క్రీడాకారులు పాల్గొనవచ్చని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ పి.అప్పలనాయుడు గురువారం తెలిపారు. గుంటూరులోని బీఆర్ స్టేడియంలో జరిగే పోటీల్లో అండర్-13,17, ఓపెన్ కేటగిరీలకు చెందిన క్రీడాకారులు పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ నెల 21లోగా వారి పేర్లను ఫోన్ 984829 8333 నంబర్‌కు సమాచారమిచ్చి నమోదు చేసుకోవాలని సూచించారు. అర్హత, ఆసక్తి గల క్రీడాకారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

21న జగయ్యపేటలో బ్యాడ్మింటన్ లీగ్

స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 21న జగ్గయ్యపేట మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో శాప్‌బ్యాడ్మింటన్ లీగ్ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడాప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ పి.అప్పలనాయుడు తెలిపారు. అండర్-13, 17 వయస్సుల విభాగాల్లో బాల,బాలికలతో పాటు మెన్ అండ్ ఉమెన్ విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయని, పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి గల క్రీడాకారులు ముందు రోజు సాయంత్రంలోగా వారి పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు.

హత్య కేసు దర్యాప్తు ప్రారంభం



సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం

తెర్లాం: మండలంలోని వెలగవలస గ్రామానికి సమీపంలోని మామిడి తోటలో ఈ నెల 16న లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహంపై స్థానిక పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి దానిని ఛేదించేందుకు గురువారం దర్యాప్తు ప్రారంభించారు. గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన స్థలాన్ని బుధవారం సాయంత్రం ఎస్పీ దీపికాపాటిల్ పరిశీలించిన విషయం తెలిసిందే. ఎస్పీ ఆదేశాల మేరకు బొబ్బిలి డీఎస్పీ మోహన్‌రావు ఆధ్వర్యంలో తెర్లాం, బాడంగి, రామభద్రపురం ఎస్సైలు ఆర్.రమేష్, జయంతి, సురేంద్రనాయుడులు మూడు బృందాలుగా ఏర్పడి గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ప్రదేశానికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు. అలాగే విశాఖపట్నం నుంచి క్లూస్ టీం చేరుకుని సంఘటన స్థలంలో నిశితంగా పరిశీలించింది. అలాగే ఈ నెల 16కి ముందు రాజాం నుంచి రామభద్రపురం, రామభద్రపురం నుంచి రాజాం ఆర్‌అండ్‌బీ రోడ్డులో రాత్రి వేళల్లో వచ్చిన వాహనాల రాకపోకలను గుర్తించేందుకు సీసీ కెమెరాల్లో నమోదైన సీసీ ఫుటేజీలను పరిశీలించేందుకు పోలీసులు అవసరమైన చర్యలు చేపట్టారు.

భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు



విలేకరులతో మాట్లాడుతున్న ఈవో రాధాకృష్ణ, ట్రస్టు బోర్డు చైర్మన్ దాలినాయుడు

మక్కువ: శంబర జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు అన్ని చర్యలు చేపడుతున్నామని పోలమాంబ ఆలయ ఈఓ రాధాకృష్ణ, ట్రస్టుబోర్డు చైర్మన్ దాలినాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ జాతరలో 95 మంది దేవాదాయ శాఖ సిబ్బంది డిప్యుటేషన్‌పై విధులు నిర్వహించనున్నట్లు చెప్పారు. పోలమాంబ అమ్మవారి దర్శన టిక్కెట్లను ఆన్‌లైన్‌లో విక్రయించనున్నామని తెలిపారు. ప్రత్యేక దర్శనం రూ.10, శీఘ్రదర్శనం రూ. 50, ఉచిత దర్శనాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. చదురుగుడి, వనంగుడి ఆలయాల వద్ద పెండాల్స్‌తో క్యూలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. 150 గ్రాముల పులిహోర రూ.10, 80 గ్రాముల లడ్డూ రూ.15 చొప్పున భక్తులకు విక్రయించనున్నట్లు తెలిపారు. ఈ ఏడాది జాతరకు సుమారు లక్షా50 వేల మంది వరకు భక్తులు తరలి వచ్చే అవకాశం ఉన్నందున అందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ధర్మకర్తల మండలి తీర్మానం ప్రకారం సిరిమానోత్సవం నిర్వహించే కమిటీ సభ్యులు ఎంపిక కోసం ఈ ఏడాది వేలం పాట నిర్వహించినట్లు తెలిపారు.


కోడి పందెం నిర్వాహకుల అరెస్టు

- రూ.9,590 స్వాధీనం

గంట్యాడ: మండలంలోని గింజేరు గ్రామంలో రాళ్ల గెడ్డ వద్ద కోడి పందాలు నిర్వహిస్తున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పోలీసులకు అందిన సమాచారం మేరకు దాడి చేసి పందెం నిర్వహిస్తున్న వారిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 9590 స్వాధీనం చేసుకున్నారు. నిర్వాహకులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

- సంఘం గౌరవాధ్యక్షుడు రామారావు



సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

నెల్లిమర్ల: రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఆ సంఘం విజయనగరం, పార్వతీపురం-మన్యం జిల్లాల గౌరవాధ్యక్షుడు, రాష్ట్ర సలహాదారు సముద్రపు రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు నెల్లిమర్ల నగరపంచాయతీ పరిధి జరజాపుపేటలోని ఆయన స్వగృహంలో రెండు జిల్లాల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎండీయూ ఆపరేటర్లకు చెల్లిస్తున్నట్లుగానే డీలర్లకు కూడా ప్రభుత్వం గౌరవ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే తమకు రావాల్సిన ఎండీఎం రైస్ కమిషన్, అంగన్వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న సరుకుల కమిషన్‌ను సంఘం ట్రస్ట్‌కు బదలాయించాలని కోరారు. రెండు జిల్లాల్లో ఇప్పటి వరకు మృతిచెందిన 125 మంది డీలర్ల కుటుంబసభ్యులకు ట్రస్ట్ ద్వారా రూ.10వేల చొప్పున ఫిబ్రవరిలో అందించడానికి తీర్మానం చేశారు. కందిపప్పు, పంచదార క్రెడిట్‌పై ఇప్పించాలని తీర్మానిస్తూ ఆ కాపీలను అధికారులకు పంపిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో రెండు జిల్లాల సంఘం ప్రతినిధులు వాన నారాయణరావు, గేదెల సత్యనారాయణ, స్కురి సూర్యారావు, పాలూరు అప్పారావు, అట్టాడ అప్పారావు, కుసుమంచి జగ్గయ్య శెట్టి తదితరులు పాల్గొన్నారు.

26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం

- ముద్రించినా, వినియోగించినా కఠిన చర్యలు
- కలెక్టర్ సూర్యకుమారి హెచ్చరిక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలను అనుసరించి జిల్లాలో ఈ నెల 26 నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీల వినియోగాన్ని నిషేధించాలని సంబంధిత విభాగాల అధికారులను కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఆదేశించారు. పర్యావరణానికి హానికలిగించే ప్లాస్టిక్‌ను నిషేధించేందుకు అన్ని విభాగాల అధికారులు చర్యలు తీసుకోవాలని, నిబంధనలు కఠినంగా అమలు చేయాలని సూచించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం గురించి అనుసరించాల్సిన విధానాన్ని తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం తన చాంబర్‌లో అధికారులతో సమావేశంలో సమీక్షించి మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రభుత్వం జారీ చేసిన జీఓలో పేర్కొన్న నిబంధనలను తు.చ.తప్పకుండా అమలు చేయాలని ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి ఈనెల 26 నుంచి జిల్లాలో ఎక్కడా ప్లాస్టిక్ ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. ప్లాస్టిక్ ఫ్లెక్సీల స్థానంలో పర్యావరణ హితమైన క్లాత్ బ్యానర్లను వినియోగించుకోవాలని సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. ఇంకా ఎవరైనా ప్లాస్టిక్‌ను ఉత్పత్తి చేసినా, విక్రయించినా మొదటి తప్పుగా రూ.50 వేలు, రెండోసారి తప్పు చేస్తే రూ.లక్ష జరిమానాతో పాటు సంబంధిత పరిశ్రమ లేదా షాప్‌ను సీజ్ చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. శుభకార్యాలు, పబ్లిక్ మీటింగ్‌లు, ర్యాలీలు, ఇతర కార్యక్రమాల్లో ప్లాస్టిక్ బ్యానర్లను ప్రదర్శించరాదని, తయారు చేయరాదని ఇతర ప్రాంతాలకు తరలించరాదని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీల పరిధిలో మరింత పర్యవేక్షణ అవసరమని అభిప్రాయ పడ్డారు.

వాయు కాలుష్యం లేకుండా ప్రమాణాలు పాటించాలి

జిల్లాలోని పట్టణాల పరిధిలో గాలి నాణ్యతను కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని కాలుష్య నియంత్రణ, మున్సిపల్ విభాగ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వాయు కాలుష్యం లేకుండా ప్రమాణాలు పాటించాలని గురువారం జరిగిన సమావేశంలో అధికారులకు సూచించారు. కేంద్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రూపొందించిన విధివిధానాలను తప్పకుండా పాటించాలని పరిశ్రమలు, వాహనాల నుంచి వెలువడే పొగ ద్వారా గాలి నాణ్యతను పరిశీలించాలని వాయు కాలుష్యం లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సిపల్ కమిషనర్లు, పట్టణ ఆరోగ్య అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. సమావేశంలో కాలుష్య నియంత్రణ విభాగం ఈఈ సుదర్శనం, పరిశ్రమల శాఖ జిల్లా మేనేజర్ పాపారావు, మున్సిపాలిటీ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, ఆర్‌టీఓ ఆదినారాయణ, ఇతర విభాగాల జిల్లాస్థాయి అధికారులు, పోలీసు అధికారులు, ప్లాస్టిక్ తయారీ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో రహదారి భద్రతా వారోత్సవాలు

- కలెక్టర్ సూర్యకుమారి



రోడ్ సేఫ్టీ వారోత్సవాల పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ సూర్యకుమారి, ఎస్పీ దీపికా పాటిల్

విజయనగరం అర్బన్: ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు నిర్వహిస్తున్న రహదారి భద్రతా వారోత్సవాల్లో ప్రభుత్వ శాఖలన్నీ పాల్గొని ప్రమాదాల నివారణకు వారి సలహాలు, సూచనలను అందించాలని కలెక్టర్ సూర్యకుమారి కోరారు. రహదారి ప్రమాదాలను తగ్గించడానికి శాఖల మధ్య సమన్వయం చాలా అవసరమన్నారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా రహదారి భద్రతా కమిటీ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఆర్‌టీసీ బస్సులను రహదారిపై ఎక్కడపడితే అక్కడ ఆపకుండా నిర్దేశించిన స్టాప్ లలోనే ఆపేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. రైతు బజార్ల ముందు రహదారులపై దుకాణాలు అధిక సంఖ్యలో వెలుస్తున్నాయని వాటిని నిరోధించాలని సూచించారు. రహదారి భద్రతపై పాఠశాలలలు, కళాశాలల్లో విద్యాశాఖ ద్వారా అవగాహన తరగతులను నిర్వహించాలని చెప్పారు. ఈ వారోత్సవాల్లో రహదారి గుర్తులు, భద్రతపై విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన తదితర పోటీలను నిర్వహించాలన్నారు. వీలైతే సిలబస్‌లో చేర్చి వారానికి ఒక తరగతి నిర్వహించాలని కోరారు. భోగాపురం హైవే పై పశువుల సంచారం, పాదచారుల క్రాసింగ్ వల్ల ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసు అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. వాటిని నిరోధించడానికి చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, సర్పంచ్‌లతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. పోలీస్, జాతీయ రహదారుల శాఖ సంయుక్తంగా తనిఖీ చేసి అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు.

ఓవర్ లోడ్ వల్ల ప్రమాదాలు

వాహనాలపై ఓవర్ లోడ్ వల్ల, కూడా ప్రమాదాలు జరుగుతున్నాయని వాటిని నియంత్రించాలని పోలీస్ అధికారులకు కలెక్టర్ సూచించారు. ఒకరిద్దరికి అపరాధ రుసుం వేస్తే ఓవర్ లోడింగ్ తగ్గించవచ్చని అభిప్రాయ పడ్డారు. అదే విధంగా హెల్మెట్ వాడకాన్ని కూడా ప్రోత్సహించాలని పోలీసు, రవాణా శాఖలే కాకుండా రెవెన్యూ ఇతర శాఖలు కూడా ఇందుకు బాధ్యత తీసుకోవాలన్నారు. ఎస్పీ దీపిక పాటిల్ మాట్లాడుతూ ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన, మరణించిన వారి ఫొటోలను, వాహనాలను రహదారి కూడళ్లలో ప్రదర్శించాలని వాటిని చూసే వారికి భయం, బాధ్యత కలుగుతాయన్నారు. సమావేశంలో రవాణా శాఖ ఉప కమిషనర్ సుందర్, జిల్లా ఆరోగ్య అధికారి డాక్టర రమణకుమారి, డీసీహెచ్ఎస్ డాక్టర్ గౌరీశంకర్, ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావు, డీఈఓ బీ.లింగేశ్వరరెడ్డి, ఆర్‌టీసీ ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)

విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 547.00
శ్రీకాకుళం	రూ. 551.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930-00
బంగారం(22సి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220